


మేనిఫెస్టోను నమ్మరు..
కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ పేర్కొన్నారు.
- 10లో ▸



డెంగీతో డేంజర్
జిల్లాలో రోజురోజుకూ విషజ్వర బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. డెంగీ జ్వరంతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /21.9

వాతావరణం
ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి 3,580 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా తగ్గుతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1,091(90 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.80(89.2 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

బతుకమ్మ చీరలు వెనక్కి..

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిన పంపిణీ

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జిల్లాలో బతుకమ్మ చీరల పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో పంపిణీ కాకుండా మిగిలిన చీరలను ఉన్నపళంగా జిల్లా కేంద్రానికి పంపించాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందు రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచులకు కానుకగా బతుకమ్మ చీరలు 4.87 లక్షలు సరఫరా చేసింది. 4.55 లక్షల వరకు పంపిణీ చేశారు. దాదాపు ఇంకా 30వేలకు పైగా చీరలు పంపిణీ చేయాల్సి ఉండగా, ఎలక్షన్ కోడ్ వచ్చేసింది. కోడ్ పడిన రోజు కొన్ని చోట్ల చీరలకు ఉన్న స్టిక్కర్లు తీసి పంపిణీ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఐతే, ఎన్నికల కోడ్ నిబంధనలు కఠినంగా ఉండడంతో చీరల పంపిణీని పూర్తిగా నిలిపేయాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లా అధికారులు అన్ని మండలాల, గ్రామాల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

జుక్కల్‌లో సీఎం కేసీఆర్ సభాస్థలి పరిశీలన

నిజాంసాగర్: జుక్కల్ నియోజకవర్గంలో ఈనెల 30న సీఎం కేసీఆర్ పాల్గొనే అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. నాందేడ్– సంగారెడ్డి జాతీయ రహదారి పక్కన జుక్కల్ చౌరస్తా వద్ద సభకు అనువైన స్థలం ఉన్నట్లు నాయకులు గుర్తించారు. బహిరంగ సభతో పాటు వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ స్థలాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జుక్కల్, బిచ్కుంద మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తొలి విడతలో మూడు

రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల మొదటి జాబితాను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం విడుదల చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం జాబితాను ప్రకటించారు. బోధన్ నియోజకవర్గం టికెట్‌ను పీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి కేటాయించగా, బాల్కొండలో ముత్యాల సునీల్‌రెడ్డికి, ఆర్మూర్‌లో పొద్దుటూరి వినయ్‌రెడ్డికి అవకాశం కల్పించారు.





01. పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి
02. ముత్యాల సునీల్‌రెడ్డి
03. పొద్దుటూరి వినయ్‌రెడ్డి

- జాబితాను విడుదల చేసిన కాంగ్రెస్ అధిష్టానం
- బోధన్ టికెట్ సుదర్శన్ రెడ్డికే..
- బాల్కొండ అభ్యర్థిత్వం ముత్యాల సునీల్‌రెడ్డికి..
- ఆర్మూర్‌లో వినయ్‌రెడ్డికి అవకాశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో మూడు నియోజకవర్గాలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం టికెట్లను ప్రకటించింది. బోధన్ టికెట్‌ను కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి ఆశించినప్పటికీ అందరూ ఊహించిన విధంగానే సుదర్శన్‌రెడ్డి వైపే అధినాయకత్వం మొగ్గు చూపింది. బాల్కొండ టికెట్ కోసం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పోటీ పడినప్పటికీ టికెట్ హామీతో పార్టీలో చేర్చుకున్న ముత్యాల సునీల్‌రెడ్డికే అవకాశమిచ్చారు. ఆర్మూర్ టికెట్ కోసం బీసీ కోటాలో గోర్త రాజేందర్ పోటీ పడినప్పటికీ బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పొద్దుటూరి వినయ్‌రెడ్డికి కేటాయించారు. నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ టిక్కెట్ల విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది.

సుదర్శన్ రెడ్డి బయోడేటా

తల్లిదండ్రులు:	రుక్మిణి, పొద్దుటూరి గంగారెడ్డి
భార్య:	సుచరితరెడ్డి
పుట్టిన తేదీ:	ఆగస్టు 2, 1950
స్వగ్రామం:	సిరాన్‌పల్లి, నవీపేట
సంతానం:	ముగ్గురు (ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు)
విద్యార్హత:	బీఏ
ప్రస్తుత చిరునామా:	ప్లాట్ 353, రోడ్ నంబర్ 23/ఏ, జూబ్లీహిల్స్, హైదరాబాద్

- 1999, 2004, 2009లో బోధన్ ఎమ్మెల్యేగా..
- వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు
- టీటీడీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా..
- నిజాం షుగర్స్ శాసనసభాసంఘం సభ్యుడు

వినయ్ రెడ్డి బయోడేటా

తల్లి తండ్రులు:	అరుణ–సురేందర్‌రెడ్డి
భార్య:	అనన్య రెడ్డి
స్వగ్రామం:	కోమన్‌పల్లి, ఆర్మూర్ మండలం
ప్రస్తుత నివాసం:	విల్లా నంబర్ 177, కొంపల్లి, హైదరాబాద్
పిల్లలు:	హృదయ్, అన్వి
విద్యార్హత:	బీటెక్
వృత్తి :	రియల్ ఎస్టేట్ వ్యాపారం, బిల్డర్

- బీఆర్ఎస్, బీజేపీలలో క్రియాశీలకంగా పనిచేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు.

“ కాంగ్రెస్‌తోనే న్యాయం

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర బడ్జెట్ రూ. 50 వేల కోట్లు ఉంటే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం. కొత్త వర్సిటీలు, మెడికల్, ఇతర కళాశాలలు నిర్మించి ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు నాణ్యమైన విద్యనందించాం. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాం. రాష్ట్రంలో ఏటా రూ. 1లక్ష 20 వేల కోట్ల బడ్జెట్ నిధులు ఎటు పోతున్నాయో అర్థం కాని పరిస్థితి. ఉద్యోగ నోటిఫికేషన్లు కంటితుడుపుగా వేసినప్పటికీ కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో 6గ్యారంటీ స్కీంలు ప్రకటించాం. మేము రాగానే అమలు చేస్తాం.
– సుదర్శన్ రెడ్డి

“ ఆర్మూర్‌లో హత్యా రాజకీయాలు

ఆర్మూర్ నియోజకవర్గంలో బెదిరింపు, హత్యారాజకీయాల సంస్కృతి నడుస్తోంది. ఈ కారణంగానే లక్కంపల్లి సెజ్‌కు పెట్టుబడి పెట్టేందుకు ఎవరూ రావడం లేదు. 30 శాతం వాటాలు అడుగుతున్న నేపథ్యంలో లక్కంపల్లి సెజ్‌కు పెట్టుబడిదారులు మొగ్గు చూపట్లేదు. లెదర్‌పార్క్ కూడా అదే పరిస్థితి. దళితబంధు పథకంలో దోపిడీ, డబుల్ ఇళ్ల హామీ గాలికి వదిలేశారు.
– పొద్దుటూరి వినయ్‌రెడ్డి

సునీల్‌రెడ్డి బయోడేటా

భార్య:	దీప్తిరెడ్డి
కుమారుడు:	రేహత్‌రెడ్డి
పుట్టిన తేదీ:	డిసెంబర్ 31, 1977
స్వగ్రామం:	సావెల్, బాల్కొండ మండలం
విద్యార్హత:	బీఎస్సీ, బీటెక్
వృత్తి:	బిజినెస్ (మేనేజింగ్ డైరెక్టర్, ఆరెంజ్ టూర్స్, ట్రావెల్స్)

- 2013లో తెలంగాణ జాగృతి ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. జాగృతి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో కవిత ఎంపీగా గెలిచేందుకు కృషి చేశారు.
- 2014లో టీఆర్ఎస్‌లో టికెట్ రాకపోవడంతో బీజేపీలో చేరారు.
- 2014లో బీజేపీ, టీడీపీ పొత్తు కారణంగా టికెట్‌ను టీడీపీకి కేటాయించడంతో సునీల్‌రెడ్డి తిరిగి టీఆర్ఎస్‌లో చేరి ఎంపీగా పోటీచేసిన కవితకు మద్దతిచ్చారు. కవిత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌కు దూరమై బాల్కొండ నియోజకవర్గం ప్రజలతో మమేకమవుతూ 2018 ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీచేసి 40 వేల ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరి టికెట్ సాధించారు.

“ ప్రజలను ఇబ్బందులు పెట్టారు

అధికారం ఉందనే అహంకారంతో నాయకులు, వాళ్ల అనుచరులు బాల్కొండ నియోజకవర్గంలో ప్రజలను అనేక ఇబ్బందులు పెట్టారు. బట్టాపూర్ గుట్ట అక్రమ తవ్వకాలు, గంజాయి దందా తదితర అంశాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారు. అక్రమాలపై ప్రశ్నించిన వారిని బెదిరించడం, ప్రశ్నించిన యువకులను కొట్టి చంపిన ఘటనలు నిజయోజకవర్గ ప్రజలు మరువలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అరాచకం చేసినవారిని వదలం.
– ముత్యాల సునీల్‌రెడ్డి

ఇక సమరమే..



సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న స్పీకర్ పోచారం, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, బిగాల



షకీల్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే

ప్రశాంత్‌రెడ్డి తరఫున బీఫాం తీసుకుంటున్న ఎమ్మెల్సీ కవిత, సీఎంకు బదులుగా ఫాం అందుకుంటున్న గోవర్ధన్

- బీ ఫాంలు అందుకున్న బిగాల, బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి, షకీల్
- ప్రశాంత్‌రెడ్డి తరఫున బీఫాం అందుకున్న ఎమ్మెల్సీ కవిత
- ప్రజల్లోకి వెళ్లాలని కేసీఆర్ దిశానిర్దేశం

సుభాష్‌నగర్/డిచ్‌పల్లి/ఆర్మూర్/వేల్పూర్/బోధన్: శాసనసభ ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల ప్రకటనలో ముందంజలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ మరో అడుగు ముందుకేసింది. తమ అభ్యర్థులకు బీ ఫాంలతో పాటు ఎన్నికల ఖర్చుల కోసం రూ.40 లక్షల చొప్పున చెక్కులను అందించింది. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవనలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ ఎమ్మెల్యే షకీల్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బీఫాంలు అందుకున్నారు. ఇటీవల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ మృతి చెందినందున ఆయనకు బదులుగా ఎమ్మెల్సీ కవిత బీఫాం అందుకున్నారు. ఆర్మూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఆశన్నగారి జీవన్‌రెడ్డి మూడో పర్యాయం బీఫాం అందుకున్నారు. 2014,1018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన ఆయన హ్యాట్రిక్ విజయం కోసం జనంలోకి వెళ్లనున్నారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఉమ్మడి రాష్ట్రంలో 2009లో టీఆర్ఎస్, టీడీపీ కూటమి తరఫున టీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీచేసిన స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2014,2018 ఎన్నికల్లో గెలిచి ఆయన సైతం హ్యాట్రిక్‌కోసం చూస్తున్నారు. అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తమకు బీఫాం అందజేసిన సీఎం కేసీఆర్‌కు మంత్రి కేటీఆర్‌కు, ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు. బాన్సువాడ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నుంచి ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎమ్మెల్యే హన్మంత్ సింధే బీ ఫాంలు అందుకున్నారు. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండగా.. ఆయన తరఫున గంపగోవర్ధన్ బీఫాం స్వీకరించారు.

20న జిల్లాకు రాహుల్‌గాంధీ

- బోధన్‌లో బీడీ, గల్ఫ్‌కార్మికులతో సమావేశం
- నిజాంషుగర్ ఫ్యాక్టరీ విజిట్
- ఆర్మూర్‌లో పసుపు, చెరుకు రైతులతో మీటింగ్
- జిల్లా కేంద్రంలో పాదయాత్ర

ఖలీల్‌వాడి : జిల్లాలో ఎట్టకేలకు ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పర్యటనను ఏఐసీసీ ఖరారు చేసింది. 20వ తేదీ శుక్రవారం మొదటగా రాహుల్ గాంధీ బోధన్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు పర్యటన ఉంటుంది. ఈ పర్యటనలో బీడీ, గల్ఫ్‌కార్మికులతో సమస్యలపై చర్చిస్తారు. అనంతరం మూతపడిన నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని సందర్శించి వివరాలు తెలుసుకుంటారు. బోధన్ పర్యటన అనంతరం ఆర్మూర్‌లో పర్యటిస్తారు. పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడుతారు. ఆర్మూర్‌లో సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు పర్యటన ఉంటుంది. అనంతరం పసుపు రైతులు, చెరుకు రైతులతో మాట్లాడి రైతుల సమస్యలను తెలుసుకుంటారు. ఆర్మూర్‌లో సమావేశం అనంతరం నిజామాబాద్‌కు చేరుకుంటారు. నగరంలో పలు ప్రాంతాలలో రాహుల్‌గాంధీ పాదయాత్ర ఉంటుంది.

18న మరో జాబితా..?

జిల్లాలో రాహుల్ బోధన్, ఆర్మూర్, నిజామాబాద్‌లో పర్యటిస్తున్నట్లు షెడ్యూల్ విడుదల చేశారు. బోధన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ నుంచి పొద్దు టూరి వినయ్ కుమార్‌రెడ్డి, బాల్కొండకు సునీల్ రెడ్డిని ఖరారు చేశారు. నిజామాబాద్ అర్బన్ స్థానానికి కూడా అభ్యర్థిని ప్రకటిస్తే ఆ అభ్యర్థికి సైతం ప్రచారం లభిస్తుందని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఈనెల 18న మరో జాబితా విడుదల య్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.



జిల్లాలో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నగరంలోని పాంగ్రా బ్యాంక్ కాలనీ దుర్గామాత మండపం వద్ద భక్తులు పూజలు చేశారు. – నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే పాతాళానికే..

- సీఎం కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డి పెద్ద అవినీతిపరుడు
- కల్వకుంట్ల ఫ్యామిలీ జైలుకు వెళ్లడం ఖాయం
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : వచ్చే ఎన్నికల్లో ప్రజలు పొరపాటున కాంగ్రెస్‌పార్టీకి అధికారం అప్పగిస్తే రాష్ట్రం అథఃపాతాళానికి వెళ్తుందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. సోనియా, రాహుల్ గాంధీల నుంచి కిందిస్థాయి వరకు కాంగ్రెస్ నాయకులు అవినీతిపరులని, వారు అధికారంలోకి వస్తే రాబోయే తరాలను నిండా ముంచేయడం ఖాయమన్నారు. ఆదివారం జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ రూరల్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మేనిఫెస్టోను ఎంపీ చించివేశారు. ప్రజలు కూడా మేనిఫెస్టోను చించి డ్రెయినేజీలో కలపాలన్నారు. లిక్కర్ స్కాం కేసు మరింత స్ట్రాంగ్ అవుతుందని, కల్వకుంట్ల ఫ్యామిలీని జైళ్లో పడేయడం ఖాయమన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి డీకే శివకుమార్ ద్వారా రేవంత్‌రెడ్డికి రూ. కోట్ల డబ్బు లారీలో తరలిస్తున్నారన్నారు. గల్ఫ్ కార్మికులు బీఆర్ఎస్‌పార్టీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని, రాష్ట్రంలో హంగ్ వచ్చినా బీజేపీదే అధికారం అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని యూనివర్సిటీలను భ్రష్టు పట్టిస్తోందని జిల్లాలో ఉన్న తెయూ అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో యువత ఉద్యోగాల్లేవన్నారు. బీఆర్ఎస్ నాయకులు రీసైకిల్ బియ్యం దందా చేస్తున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే తరుగు లేకుండా ధాన్యం కొంటామన్నారు. బీజేపీ ఎంపీ ఉండటంతోనే మాధవనగర్ ఆర్‌వోబీ పనులు జరుగుతున్నాయని, తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల లాగా అవినీతి, భూకబ్జాలకు పాల్పడట్లేదన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం

బోధన్‌టౌన్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని, సారంగపూర్ సహకార షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభింపజేస్తామని ఎంపీ అర్వింద్ హామీ ఇచ్చారు. బోధన్, రూరల్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో చెరుకు, పసుపు విస్తృతంగా సాగు చేసేవారన్నారు. ప్రధాని మోదీ నిజామాబాద్ పర్యటనలో జాతీయ పసుపు బోర్డు ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రూరల్ ఇంచార్జీ కులాచారి దినేష్‌కుమార్, ఎంపీపీ గద్దె భూమన్న, అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, న్యాలం రాజు ఉన్నారు.

ప్రకృతి పండుగ.. భక్తితో నిండుగా..

- తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ
- భక్తి, జానపదాల మేళవింపు
- జిల్లాలో ఉత్సాహంగా సంబురాలు

నిజామాబాద్ సిటీ/మోర్తాడ్ : రామరామ రామ ఉయ్యాలో... రామనే శ్రీరామ ఉయ్యాలో అంటూ 9 రోజుల పాటు జరుపుకునే పూల పండగ శనివారం జిల్లా వ్యాప్తంగా సంబురంగా ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మలో భాగంగా ఎంగిలిపూల, అటుకుల బతుకమ్మ పూర్తికాగా, ఈ వేడుకల్లో పాల్గొన్న మహిళలు పాటలు పాడుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ ఆడారు. యువతులు, చిన్నారులు డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

తెలంగాణకే ప్రత్యేకమైన ఈ పూల జాతర పల్లె పల్లెన పండుగ వాతావరణం తీసుకువచ్చింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ వేడుకను అధికార పండుగగా గుర్తించింది. ప్రతి ఏడాది బతుకమ్మ వేడుకలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారెను పంపిణీ చేస్తూ వస్తోంది.

నిమజ్జనానికి ఏర్పాట్లు

జిల్లా కేంద్రంలో మహిళలు జరుపుకునే బతుకమ్మ వేడుకలకు, నిమజ్జనాలకు సంబంధించి ప్రభుత్వపరంగా ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఖిల్లా రఘునాథ చెరువు(బొడ్డెమ్మ చెరువు), పూలాంగ్ వాగు ప్రవహించే గాయత్రీనగర్, పూలాంగ్‌చౌరస్తా బ్రిడ్జి పక్కన, గంగాస్థాన్ ప్రాంతం, ముబారక్‌నగర్ ప్రాంతాల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అలాగే మాధవనగర్, బోర్గాం(పి) గ్రామాల సమీపంలోని ఊర చెరువులో బతుకమ్మలు నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం వాడకంలో ఉన్న రఘునాథ చెరువును ఒకప్పుడు బొడ్డెమ్మ చెరువుగానే పిలిచేవారు. ఇప్పటికీ చాలమందికి బొడ్డెమ్మ చెరువు అంటేనే తెలుస్తుంది. ఈ చెరువు పక్కనే అతిపురాతన ఆలయం రఘునాథ ఆలయం ఉండటంతో ఈ పేరునే బొడ్డెమ్మ చెరుకు నామకరణం చేయటంతో రఘునాథ చెరువుగా పిలుస్తున్నారు.



హమాల్‌వాడిలో సాయిబాబా ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఔషధ గుణాలెన్నో..

బతుకమ్మ పూజకు వినియోగించే పూలలో ఔషధ గుణాలు ఎన్నో ఉన్నాయి. అతివల ఆరోగ్యాన్ని కాపాడుతుందని నమ్మకం. బతుకమ్మకు వినియోగించే తంగేడు, గునుగు, సీతజడ, గన్నేరు, మోదుగ, గడ్డి, బొగిడె, కనకాంబురం, గడ్డిపూలు, చిన్న తుంగ, గుమ్మడి, చామంతి, బంతి, తామర, మందారం, చంద్రకాంతి పూలలో ఔషధ గుణాలు ఉన్నాయి.



కన్యకా పరమేశ్వరి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ అంటే..

కాకతీయుల ఆరాధ్య దేవత కాకాతమ్మను మహిళలు తీరొక్క పూలతో పూజించగా ఆ దేవత పూలతో నిండిపోయింది. ఈ ఆచారం నేటికి కొనసాగుతోంది. పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ బతుకునివ్వమ్మా అంటూ ఆరాధించటం ప్రారంభమైంది. ప్రతి ఏడాది భాద్రపద బహుళ పంచమి మొదలు నుంచి బొడ్డెమ్మల ఉత్సవాలు ప్రారంభమై, బొడ్డెమ్మ సంబురాలు మహాలయ అమావాస్య (పితృ అమావాస్య) వరకు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. అనంతరం పితృ అమావాస్య నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. బతుకమ్మ పర్వానికి మొదలు 9రోజులు కన్నె పిల్లలు ఆడుకునే బొడ్డెమ్మకు బతుకమ్మ పాటలే పాడుకుంటుండటం విశేషం. ఇప్పటికీ కాకతీయ వంశస్తులు బస్తర్, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల్లో అటూ కాకతమ్మను, తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పేరుతో కొలుస్తూ ఉండటం గమనార్హం.

▪ ఎంగిలిపూల బతుకమ్మ

ఎంగిలిపూల బతుకమ్మను అమావాస్య రోజు పేరుస్తారు. ఈ రోజు నువ్వులు, బెల్లం, చక్కెరలను ప్రసాదంగా వాడుతారు.

▪ అటుకుల బతుకమ్మ

రెండవరోజు జరుపుకునే పండుగను అటుకుల బతుకమ్మగా పిలుస్తారు. సప్పటి పప్పు, బెల్లం, అటుకులను ప్రసాదం.

▪ ముద్దపప్పు బతుకమ్మ

మూడోరోజు పూలతో పేర్చే బతుకమ్మను ముద్దపప్పు బతుకమ్మగా పిలుస్తారు. ఈ రోజు ముద్దపప్పు, బెల్లం, పాలతో తయారు చేసిన పాయసాన్ని పంచిపెడుతారు.

▪ నానబియ్యం బతుకమ్మ

నాల్గో రోజు జరుపుకునే నాన బియ్యం బతుకమ్మ రోజు నానపెట్టిన బియ్యంతో పాయసం తయారు చేసి ఈ ప్రసాదాన్ని మరొకరికి ఇస్తూ వారు ఇచ్చే ప్రసాదాన్ని స్వీకరిస్తారు.

▪ అట్ల బతుకమ్మ

ఐదోరోజు జరుపుకునే అట్ల బతుకమ్మకు పూజలు చేసి పాటలు పాడి అనంతరం నిమజ్జనం చేశాక బియ్యం పిండితో వేసిన అట్లను ప్రసాదంగా స్వీకరించటం ఆనవాయితీ.

▪ అలిగిన బతుకమ్మ

ఆరవరోజు జరుపుకునే బతుకమ్మను అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. ఈరోజు బతుకమ్మ అలిగిన సందర్భంగా అరిష్టంగా భావించి బతుకమ్మను వేడుకలు జరుపుకోరు. ఒకవేళ బతుకమ్మ ఆడిన ఎలాంటి ప్రసాదాలు చేయరు.

▪ వేపకాయల బతుకమ్మ

బతుకమ్మలను పేర్చి ఆట పాటలు ఆడి ప్రసాదంగా సకినాలు చేసి పిండిని వేపకాయలంత పరిమాణంలో ముద్దలు చేసి నూనెలో వేయించి ప్రసాదంగా పంచి పెడుతారు.

▪ వెన్నముద్దల బతుకమ్మ

వెన్నముద్దల బతుకమ్మగా పిలిచే నేడు నువ్వులు, వెన్న, బెల్లం, నెయ్యితో తయారు చేసిన ఫలహారం అంటే బతుకమ్మకు ఎంతో ఇష్టమైన రోజు.

▪ సద్దుల బతుకమ్మ

చివరిరోజు బతుకమ్మ సంబురాల్లో సద్దుల బతుకమ్మకు పెరుగన్నం సద్ది, చింతపండు, నిమ్మకాయలతో తయారు చేసిన పులిహోర, కొబ్బరి తురుము సద్ది, నువ్వుల పొడి కలిపిన సద్దిలను ప్రసాదంగా స్వీకరిస్తారు.

క్లుప్తంగా

రంగు మారుతున్న ఎస్సారెస్పీ నీరు



బాల్కొండ: ఎస్సారెస్పీలో నిల్వ ఉన్న నీరు మళ్లీ రంగు మారుతోంది. నెల రోజుల క్రితం ప్రాజెక్ట్‌ నీరు రంగు మారడంతో కలెక్టర్‌ వచ్చి నీటిని పరిశీలించారు. పరీక్షల నిమిత్తం శాంపిళ్లను పంపించాలని అధికారులను ఆదేశించారు. కానీ పరీక్షల ఫలితాలు ఇంకా రాలేదు. ఇంతలో ప్రాజెక్టు నీరు మళ్లీ రంగు మారడంతో ప్రాజెక్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు చరిత్రలో ఎనాడు రంగు మారలేదని దశాబ్ద కాలంగా ఎస్సారెస్పీ నీరు రంగు మారుతోందని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఉన్నత అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

‘బీఎల్‌ఎఫ్‌ను గెలిపించాలి’



కామారెడ్డి టౌన్‌: అవినీతి లేని సమాజం కోసం బీఎల్‌ఎఫ్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర చైర్మన్‌ నల్ల సూర్య ప్రకాష్‌ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో పార్టీలు, నాయకులు, జెండాలు మారిన పేదల బతుకులు మారడం లేదన్నారు. బీఎల్‌ఎఫ్‌ కామారెడ్డి అసెంబ్లీ అభ్యర్థి, కార్మిక పోరాట నాయకుడు సిద్దిరాములును గెలిపించాలని ఓటర్లను కోరారు. దండి వెంకట్‌, ఆంజనేయులు, వడ్ల సాయి కృష్ణ, గంగమణి, సబిత తదితరులున్నారు.

ప్రమాదకరంగా వాటర్‌ ట్యాంక్‌



తాడ్వాయి: మండలంలోని కృష్ణాజీవాడి ప్రభుత్వ పాఠశాల ఆవరణలతో ఉన్న మంచి నీటి ట్యాంకు ప్రమాదకరంగా మారింది. ట్యాంక్‌ నుంచి పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో పిల్లర్లకు సంబంధించిన పెద్దపెద్ద పెచ్చులు ఊడి కిందపడిపోతున్నాయి. దీంతో ట్యాంకు కూడా కూలే అవకాం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో విద్యార్థులు ఉన్న సమయంలో ట్యాంక్‌ కూలితే పెద్ద ప్రమాదం జరుగుతుంది. ప్రస్తుతం దసరా సెలవులు ఉన్న నేపథ్యంలో ట్యాంక్‌కు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డెంగీతో డేంజర్‌

- సెప్టెంబర్‌లోనే 311 కేసులు
- ఆస్పత్రులకు పోటెత్తుతున్న రోగులు
- ఆందోళనలో ప్రజలు



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో విష జ్వరాలతో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. డెంగీ, తీవ్ర గొంతు సమస్యలు, వైరల్‌ ఫీవర్స్‌తో ప్రజలు వణికిపోతున్నారు. పల్లె, పట్టణాల్లోని ప్రతి ఇంట్లో ఒక్కరు చొప్పున తీవ్ర జ్వరంతో బాధపడుతున్నవారే ఎక్కువ. దీనికి తోడు గొంతు సమస్య తీవ్రంగా వేధిస్తుండడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుప్రతులకు బాధితులు క్యూ కడుతున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదు కాగా సెప్టెంబర్‌లో 311వరకు కేసులు నమోదయ్యాయి. జిల్లా కేంద్రంలో 200లకు పైగా ప్రైవేట్‌ ఆస్పత్రులు ఉండగా ఒక్కో ఆస్పత్రిలో 30వరకు జ్వరంతో బాధపడుతున్న వారే అధికం. గడిచిన నెలలో ప్రైవేటు ఆసుప్రతుల్లో డెంగీతో ముగ్గురు చొప్పున ఒక్కో ఆసుప్రతిలో అడ్మిట్‌ కాగా సదరు వైద్యులు రూ. వేలల్లో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఎన్‌ఎస్‌–1 టెస్టుతో డెంగీ అని చెప్పి రోగులకు తూతూమాత్రంగా చికిత్స చేసి రూ. వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎన్‌ఎస్‌–1తో పాటు ఎలీసా టెస్టులో పాజిటివ్‌ వస్తే డెంగీ వచ్చినట్లు నిర్ధారణ అవుతుంది. కానీ సదరు వైద్యులు రోగుల ఆసరాను తమకు అనుకూలంగా మల్చుకొని ఆసుప్రతులకు వచ్చే బాధితుల జేబులను గుల్ల చేస్తున్నారు. దీంతో ఆసుప్రతుల బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దగ్గుతో కలవరం..

డెంగీతో పాటు తాజాగా దగ్గుతో బాధపడుతున్న వారి సంఖ్య జిల్లాలో పెరుగుతోంది. జ్వరాలు వస్తే చాలు దగ్గు మొదలవుతోంది. వారం రోజుల తర్వాత జ్వరంగా తగ్గిపోయినా, దగ్గు మాత్రం తగ్గడం లేదు. దగ్గుతో పాటు గొంతులో మంట, నొప్పి, పలు సమస్యలతో ఈఎన్‌టీ వైద్యుల వద్దకు బాధితులు పరుగులు తీస్తున్నారు. దగ్గుకు సంబంధించి మందులతో పాటు యాంటిబయాటిస్‌ వాడినా ఉపశమం లభించడం లేదంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ మార్పులే..

ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అప్పుడే చలి, ఎండ ఉండడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా విష జ్వరాల బారిన పడుతున్నారు.

సరిపడ మందులు ఉన్నాయి

సీజనల్‌ వ్యాధులు ప్రబలుతున్నాయి. సెప్టెంబర్‌ నెలతో పోల్చితే డెంగీ కేసులు కాస్త తగ్గాయి. వైరల్‌ ఫీవర్స్‌, దగ్గు సమస్యతో చాలా మంది బాధపడుతున్నారు. అన్ని పీహెచ్‌సీల్లో మందులు సరిపడ ఉన్నాయి. రోగాలతో బాధపడేవారు ప్రభుత్వ ఆసుప్రతుల్లోనే చూయించుకోవాలి. బాధితులకు రక్త పరీక్షలతో పాటు, తగిన వైద్యం అందుతోంది.

– సుదర్శనం, డీఎంహెచ్‌వో

జాగ్రత్తలు తప్పనిసరి

వాతావరణంలో అనేక మార్పులు వస్తున్నాయి. అందుకే వైరల్‌ ఫీవర్స్‌ పెరుగుతున్నాయి. గొంతు సమస్యతో బాధపడేవారి సంఖ్య పెరిగింది. జ్వరం తగ్గినా దగ్గు తగ్గడం లేదు. అందుకు బాధితులు వేడి, వేడి పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. సీ విటమిన్‌ ఉన్న పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. జాగ్రత్తలతో చెక్‌ పెట్టొచ్చు.

– తుకారాంరాథోడ్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో

మంత్రికి పలువురి పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి

వేల్పూర్‌: మండల కేంద్రంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని పలువురు ఆదివారం పరామర్శించారు. ఇటీవల మంత్రి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మంత్రిని పరామర్శించిన వారిలో రాజ్యసభ సభ్యులు కేఆర్‌ సురేశ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, లింగయ్యయాదవ్‌, ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, క్రైస్తవులు ఉన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూర్‌ హైస్కూల్‌కు చెందిన 1997–98 సంవత్సరం పదో తరగతి పూర్వవిద్యార్థులు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అ‘పూర్వ’ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, జైపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నారాయణరెడ్డి, విఠల్‌రెడ్డి, సుభాష్‌, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్‌ పోటీలకు ఎంపిక



వర్షిత్‌ను అభినందిస్తున్న కప్‌ ఇన్‌చార్జ్‌ డేవిడ్‌

సిరికొండ: జాతీయస్థాయి బేస్‌బాల్‌ పోటీలకు సిరికొండ సత్యశోధక్‌ పాఠశాల విద్యార్థి వర్షిత్‌ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ఓయూ మైదానంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్‌–13 మేజర్‌ లీగ్‌ బేస్‌బాల్‌ కప్‌ పోటీల్లో వర్షిత్‌ తెలంగాణ స్ట్రైకర్స్‌ జట్టు తరఫున పాల్గొని జట్టు చాంపియన్‌షిప్‌ సాధించడంలో ప్రధానపాత్ర పోషించాడని ప్రిన్సిపాల్‌ నర్సయ్య తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వర్షిత్‌ను అమెరికాకు చెందిన ఎంఎల్‌బీ కప్‌ ఇండియా ఇన్‌చార్జి డేవిడ్‌ అభినందించారు. బేస్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మధుసూదన్‌, సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్‌, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి మల్లేశ్‌గౌడ్‌, జట్టు కోచ్‌లు అనిల్‌, నరేశ్‌, సంతోష్‌ వర్షిత్‌ సన్మానించారు. జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న జోనల్‌ క్రీడలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు



బాన్సువాడ రూరల్‌: మండలంలోని బోర్లం క్యాంపులోగల తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో జోనల్‌స్థాయి క్రీడలు కొనసాగుతున్నాయి. ఈనెల 13న ప్రారంభమైన పోటీలు ఈనెల 16న ముగియనున్నాయి. ఆదివారం అండర్‌ 14, 17, 19 విభాగాల్లో గెలుపొందిన వారికి ఆర్‌సీవో అలివేలు, డీసీవో కృతామూర్తి, ప్రిన్సిపల్‌ పద్మకుమారిలతో కలిసి బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌సీవో అలివేలు

కేసీఆర్‌ మేనిఫెస్టోను నమ్మే పరిస్థితి లేదు

- బీజేపీ నేత ధన్‌పాల్‌ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ధన్‌పాల్‌ సూర్యనారాయణ

సుభాష్‌నగర్‌: సీఎం కేసీఆర్‌ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అనేకమంది అమాయక యువకులు, అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్‌ సూర్యనారాయణ విమర్శించారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రకటించిన మేనిఫెస్టోను అమలుచేయని కేసీఆర్‌ను కొత్త హామీలతో మరోసారి మోసం చేసేందుకు వస్తే ప్రజలు తరిమికొడతారన్నారు. మేనిఫెస్టోలో నిరుద్యోగుల ప్రస్తావన లేదని, వారికి ఎలాంటి అవకాశాలు లేవా? అని ప్రశ్నించారు. సౌభాగ్యలక్ష్మి పేరుతో రూ.3వేలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమని, నిరుద్యోగులకు ఇచ్చిన రూ.3016 హామీ నేటికీ అమలు కాలేదని గుర్తుచేశారు. ఈసారి మహిళలను మోసం చేసేందుకు కేసీఆర్‌ సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ పాలనపై ప్రజల విసిగివేసారిపోయారని, కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ఒకే గూటి పక్షులని ఆరోపించారు. పేదల అభ్యున్నతి ప్రధాని మోదీ, బీజేపీతోనే సాధ్యమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల కోసం మేనిఫెస్టోను బీజేపీ రూపొందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి అవకాశమివ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఖైసర్‌, నాయకులు ప్రభాకర్‌, ఆమందు విజయ్‌, శ్రీనివాస్‌, శివ పాల్గొన్నారు.

గోడలపై రాతల తొలగింపు



ఎన్నికల కోడ్‌ అమలులోకి వచ్చినందున నిబంధనల మేరకు మండలంలోని అన్ని చోట్ల గోడలపై రాసిన పార్టీల గుర్తులు, రాతలను పంచాయతీ ఉద్యోగులు సిబ్బందితో తొలగింపు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ఫ్లెక్సీలను తొలగించారు. గతంలో కొన్ని పార్టీలు ప్రభుత్వానికి సంబంధించి, పార్టీకి సంబంధించిన రాతలను గోడలపై రాయించాయి. వీటిని ఆయా జీపీ కార్యదర్శులు దగ్గర ఉండి తొలగింపు పనులు చేపడుతున్నారు. - మోర్తాడ్‌

క్రైం కార్నర్‌

గోపాల్‌పేటలో వృద్ధుడి అదృశ్యం



నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేటకు చెందిన ఆత్మకూరి దుర్గయ్య మూడు రోజుల క్రితం అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. దుర్గయ్య ఈ నెల 13న ఆసుప్రతిలో చూయించుకుంటానని మెదక్‌కు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దుర్గయ్య కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ. 4 లక్షల నగదు పట్టివేత



భిక్కనూరు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ. నాలుగు లక్షల నగదును శనివారం రాత్రి పట్టుకున్నట్లు కామారెడ్డి డీఎస్పీ ప్రకాశ్‌, సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. నిర్మల్‌ పట్టణానికి చెందిన అఖిల్‌ తన కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. తనిఖీలో రూ. నాలుగు లక్షల నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్‌ స్కాడ్‌ బృందానికి అప్పగించినట్లు తెలిపారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత



నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పరిధిలో పీడీఎస్‌ బియ్యంతో అక్రమంగా తరలుతున్న లారీని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌ కుమార్‌ తెలిపారు. పక్కా సమాచారం మేరకు హైదరాబాద్‌ నుంచి మహారాష్ట్రకు 340 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం తరలుతున్నట్లు సమాచారం అందడంతో నగర శివారులో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. లారీని సీజ్‌ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాల్కొండలో గంజాయి స్వాధీనం

బాల్కొండ: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపడుతుండగా 350గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై గోపీ ఆదివారం తెలిపారు. నిర్మల్‌ నుంచి ఆర్మూర్‌ వైపు వస్తున్న ఆటో పోలీసులను చూసి డ్రైవర్‌ తిప్పడంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. ఆటోలో ఉన్న షేక్‌ ముక్తార్‌, షేక్‌ రిజ్వాన్‌ నుంచి 350గ్రాముల గంజాయి లభించడంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బెల్ట్‌షాప్‌పై దాడి

పెద్దకొడప్‌గల్‌: మండలంలోని అంజని గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై కోనారెడ్డి ఆదివారం తెలిపారు. దాడిలో మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

కామారెడ్డి క్రైం: మద్యం తాగి ఎందుకు జులాయిగా తిరుగుతున్నావని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావూ నాయక్‌ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్‌ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌ గ్రామానికి చెందిన అనిల్‌ కుమార్‌ (23) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన అనిల్‌కుమార్‌ గ్రామ సమీపంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విచారణ చేపట్టి కేసు నమోదు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..

దోమకొండ: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొర్నిపాటి లక్ష్మీతిరుపతమ్మ(22) ఏడాది నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తండ్రి చాగంటి నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ తగాదాలతో మరొకరు..

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరి నదిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్‌ కాలనీకి చెందిన షేక్‌ సలీం(36) కుటుంబ తగాదాలతో గోదావరి నది దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య తబస్సుం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..



ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

బీబీపేట: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన తుజాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం ఆకారం గ్రామానికి చెందిన అబ్రబోయిన నర్సింలు (45) వృత్తి రీత్యా చేపలు పడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం సాయంత్రం తుజాల్‌పూర్‌– ఆకారం గ్రామాల మధ్య ఉన్న వాగులో చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం తుజాల్‌పూర్‌ వాగులో మృతదేహం లభ్యమైంది. వాగులో వేసిన మోటర్ల వల్లే విద్యుత్‌ షాక్‌ తగిలి నర్సింహులు మృతి చెందాడని కుటుంబీకులు, బంధువులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తల్లి కిష్టవ్వ ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


కొడుకును చంపిన తండ్రి



శ్రీకాంత్‌ (ఫైల్‌)

నవీపేట: రెండో పెళ్లి చేసుకునేందుకు అడ్డంకిగా మారిన కొడుకును తండ్రి దారుణంగా హతమార్చిన ఘటన మోకన్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. నిజామాబాద్‌ నార్త్‌ జోన్‌ సీఐ సతీశ్‌, ఎస్సై యాదగిరి గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగెం కిషన్‌ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. తనకున్న 20 గుంటల భూమిని అమ్మగా రూ. 9 లక్షలు వచ్చాయి. దీంతో అప్పులు తీర్చగా మిగిలిన రూ. నాలుగు లక్షల నగదును తన దగ్గరే ఉంచుకున్నాడు. ఈ విషయమై తండ్రి కిషన్‌ కొడుకు శ్రీకాంత్‌(25) మధ్య నిత్యం గొడవ జరిగేది. తాను రెండో పెళ్లి చేసుకుంటానని, డబ్బులు ఇచ్చేది లేదని కిషన్‌ చెప్పాడు. దీంతో శనివారం రాత్రి రెండో పెళ్లి చేసుకోవద్దని తండ్రితో గొడవపడ్డాడు. దీంతో తన రెండో పెళ్లికి అడ్డుగా వస్తున్నాడనే కోపంతో ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న శ్రీకాంత్‌ తలపై కర్రతో బాది చంపాడు. మృతుడి భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

కుప్రియాల్‌లో భూవివాదం



గుమ్మిగూడిన ఇరు సంఘాల సభ్యులు

సదాశివనగర్‌: మండలంలోని కుప్రియాల్‌లో రెడ్డిసంఘం, బేస్త సంఘం సభ్యుల మధ్య ఆదివారం వివాదం తలెత్తినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని రెడ్డి సంఘాల సభ్యులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఫంక్షన్‌ హాలుగా మార్చుతున్నారని బేస్త సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయమై బేస్త సంఘం వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్సై నర్సయ్య రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. సోమవారం భూసమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఈ భూవిషయంలో సంబంధిత రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బేస్త సంఘం సభ్యులు ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో తమ సంఘానికి భూమి కేటాయించాలని కోరారు.

ఏఆర్‌ కానిస్టేబుల్‌ సస్పెన్షన్‌

ఖలీల్‌వాడి: ఆర్మూర్‌ పీఎస్‌ ఏఆర్‌ కానిస్టేబుల్‌ కణికరం నటరాజుపై చీటింగ్‌, రేప్‌ కేసు నమోదు కావడంతో సస్పెన్షన్‌ చేస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్‌ ఆదివారం తెలిపారు. వేల్పూర్‌ మండల కేంద్రానికి చెందిన తన స్నేహితుని భార్యను లొంగదీసుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మించి భర్తతో విడాకులు ఇప్పించాడు. పెళ్లి విషయమై బాధితురాలి తల్లిదండ్రుల ఇటీవల నటరాజును సంప్రదించగా అతను కొట్టి పంపించాడు. దీంతో బాధితురాలు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. నటరాజుపై చీటింగ్‌, రేప్‌, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు కావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే నటరాజును సస్పెన్షన్‌ చేసినట్లు సీపీ తెలిపారు.